# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 14-07-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని జలాశయాలను మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.
- నంద్యాల జిల్లాను ఆంధ్రప్రదేశ్ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.
- రాష్ట్రంలో మాదకద్రవ్యాలు వినియోగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు.
- మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) కార్యాలయంలో రేపు "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం జరగనుంది.

========================

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సోమశిల, కండలేరు జలాశయాలను మరింత పటిష్టం చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఈరోజు ఆయన మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డిలతో కలిసి సోమశిల జలాశయాన్ని సందర్శించారు. వరదల వల్ల దెబ్బతిన్న అఫ్రాన్ ను మంత్రులు పరిశీలించారు. దెబ్బతిన్న వాటికి చేయబోయే మరమ్మతులను మంత్రులకు ఇంజినీర్లు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామా నాయుడు మాట్లాడుతూ... 60 రోజుల్లో ఆఫ్రాన్ మరమ్మతు పనులను ప్రారంభిస్తామని, జిల్లాలోని జలాశయాలని అభివృద్ధి చేస్తామని తెలిపారు.

========================

రాష్ట్రంలో మత్తు పదార్థాలు వినియోగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మద్యం మత్తులో ఉన్న యువకుడి చేతిలో గాయపడి, విశాఖలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నపోలీసు కానిస్టేబుల్ ను హోం మంత్రి అనిత ఈ రోజు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోలీసులకు ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని, విధుల్లో ఉన్న పోలీసులు ఆత్మస్థైర్యంతో పని చేయాలని హోం మంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

నంద్యాల జిల్లాను ఆంధ్రప్రదేశ్ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నంద్యాల పట్టణంలోని చిన్న చెరువు పార్కును మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి గణియాతో కలిసి మంత్రి దుర్గేష్ ఈ రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ... చిన్న చెరువును పర్యాటక పరంగా అభివృద్ధి చేస్తామని పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) కార్యాలయంలో, అన్ని జోనల్ కార్యాలయాల్లో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం రేపు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జివిఎంసి అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఒక ప్రకటనలో తెలిపారు. పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, మొక్కల విభాగం, రెవిన్యూ, యు.సి.డి, ఇంజనీరింగ్ తదితర విభాగాలకు సంబంధించిన సమస్యలను ప్రజలు అర్జీల ద్వారా విన్నవించుకోవచ్చునని ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖల మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఈ రోజు కృష్ణా జిల్లా మచిలీపట్నం మంత్రి క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... గోదావరి జలాలను కృష్ణా జలాలతో అనుసంధానం చేస్తూ, పంటలకు అవసరమైన సాగునీటిని అందించే దిశగా చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ వస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో బాలికలు, మహిళలకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. విజయనగరం జిల్లాలో అత్యాచార ఘటనకు గురైన చిన్నారి బాధిత కుటుంబాన్ని ఈరోజు ఆమె పరామర్శించారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నిందితుడిని వీలైనంత త్వరగా కఠినంగా శిక్షించేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలియజేస్తూ....

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండు, మూడు రోజులలో రాయలసీమ, యానాం ప్రాంతాలలో పలు చోట్ల ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆషాఢ మాసం సందర్భంగా ఈ రోజు విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు భక్తులు బోనాలు, సారె సమర్పించారు. తెలంగాణకు చెందిన భాగ్యనగర్ మహంకాళి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో దుర్గమ్మకు బంగారు బోనం సమర్పించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర జలశక్తి అభియాన్ కార్యక్రమ నోడల్ అధికారి జితేంద్ర సింగ్ ఈ రోజు పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలంలోని లింగరాయుడుగూడెం, కడియద్ద గ్రామాల్లో పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జల్ జీవన్ మిషన్, జలశక్తి పథకాల అమలు తీరుని పరిశీలించారు. అమృత్ సరోవర్ పథకంలో అభివృద్ధి చేసిన చెరువులను, జల్ జీవన్ మిషన్ ద్వారా అందిస్తున్న ఇంటింటి కుళాయి కనెక్షన్లను పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. జల్ జీవన్ మిషన్, జలశక్తి పథకాలు ప్రజలకు ఏ మేరకు అందుతున్నాయో తెలుసుకునేందుకు ఇప్పటి వరకు చేపట్టిన పనులను పరిశీలిస్తున్నామని జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఒడిశా రాష్ట్రంలోని పవిత్ర పట్టణం పూరీలో జగన్నాథ స్వామి ఆలయ నిధి రత్న భండార్ తలుపులు ఈ రోజు మధ్యాహ్నం తెరిచారు. ఈ గదిలో చివరిసారిగా ఆభరణాలు, ఇతర విలువైన వస్తువుల జాబితా చివరిసారిగా 1978లో లెక్కించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పామాణిక నిర్వహణ ప్రక్రియను అనుసరించి రత్న భండార్ ఒక ప్రత్యేక బృందం తెరిచారు. ఆభరణాలతో కూడిన ప్రత్యేక పెట్టెలను ఉంచేందుకు భారీ భద్రతతో కూడిన తాత్కాలిక ప్రత్యేక గదులను ఏర్పాటు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

తూర్పుగోదావరి జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు కోరుకొండ నుండి మునగాల వెళ్ళే రహదారి పూర్తిగా ధ్వంసం కావడంతో ట్రాఫిక్ ను మళ్లించామని జిల్లా రహదారులు, భవనాల శాఖ అధికారి ఎస్ బీ.వి.రెడ్డి ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మళ్లింపు రహదారి కూడా ప్రవాహంలో కొట్టుకుపోవడంతో, కోరుకొండ నుండి మునగాల మధ్య రాకపోకలు శ్రీరంగపట్నం మీదుగా మళ్ళించామని ఆయన వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులకు నిరీక్షణ సమయాన్ని తగ్గించేదిశగా చర్యలు తీసుకోవాలని టీటీడీ ఉన్నతాధికారులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఈరోజు ఉదయం స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) ద్వారకా తిరుమలరావు కూడా కుటుంబ సమేతంగా వెంకటేశ్వర స్వామి వారి సుప్రభాత సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధిలోని శ్రీకిష్ణాపురం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఈ రోజు “ఐ యామ్ కలాం” చలనచిత్రాన్ని ప్రదర్శించారు. విద్యార్థులు ఎంతో ఆసక్తిగా ఈ చిత్రాన్ని తిలకించారు. సెలవు దినాల్లో విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోకుండా ఉంచేందుకు వినోదాత్మకంగా విజ్ఞానాన్ని అందించేందుకు ఐటీడీఏ అధికారులు ప్రయోగాత్మకంగా విజ్ఞానాన్ని అందించే చలనచిత్రాలను ప్రదర్శిస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో విరామ దర్శనాలకు రేపు ఎలాంటి సిఫారసు లేఖలను స్వీకరించబోమని తిరుమల తిరుపతి దేవస్థానం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 16వ తేదీన ఆణివార ఆస్థానం నిర్వహించనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని టీటీడీ వివరించింది. వర్షాలు విస్తృతంగా కురుస్తున్న నేపథ్యంలో తిరుపతి - తిరుమల మధ్య ఘాట్ రోడ్ల ద్వారా ప్రయాణాలు సాగిస్తున్న వాహనాలను నెమ్మదిగా నడపాలని వాహనదారులకు సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = =